జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 13 | జనవరి | 2026 • పేజీలు : 7

# ప్రజా ప్రయోజనాలే జర్నలిజం లక్ష్యం..

- ప్రజా ప్రయోజనాలే జర్నలిజం లక్ష్యం..
- ప్రజాజ్యోతి క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం

**కొత్తగూడెం, జనవరి 12, ప్రజాజ్యోతి :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రజాజ్యోతి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెంలోని రామవరం ఎస్సీబీ నగర్ లో ఆర్జె హవాయి స్టీల్ షాప్ ఓపెనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి

మిగతా 2 లో...



- గుర్తింపు సంఘ నేతపై గిరిజన, వికలాంగ ఉద్యోగి ఫిర్యాదు
- ఏరియా స్టోర్ ఘటనతో సింగరేణిలో కార్మిక సంఘాల పాత్రపై ప్రశ్నలు
- ఎఐటియుసి నేతపై ఆరోపణలు – మౌనంగా ఉన్న సంఘ అధిష్టానం
- 58 ఏళ్ల వికలాంగ ఉద్యోగిపై వేధింపుల ఆరోపణలు కలకలం
- సమ్మెల కోసం నిలిచే సంఘమే బెదిరిస్తోందన్న కార్మికుల ఆవేదన
- ఎస్సీ–ఎస్టీ అంశంగా మారిన ఫిర్యాదు – విచారణ తప్పదా?
- కార్మికుల్లో పెరుగుతున్న నిరుత్సాహం, వ్యతిరేకత




2 లో..

# గుర్తింపు హోదా...
# నేతల ఇష్టారాజ్యానికి
# కవచమా?

గుర్తింపు పొందిన సంఘ నేతలే వేధిస్తుంటే.. హక్కుల కోసం నిలబడాల్సినవాళ్లే నానా మాటలు అంటుంటే.. ధైర్యం చెప్పాల్సినవాళ్లే బెదిరిస్తుంటే.. అలాంటి పరిస్థితుల్లో కార్మికుడు ఎవరిని నమ్మాలి..? ఎవరికి తన బాధ చెప్పాలి..? అనే ప్రశ్నలు ఇప్పుడు సింగరేణిలో బలంగా వినిపిస్తున్నాయి. కొత్తగూడెం ఏరియా స్టోర్ లో గిరిజన, వికలాంగ ఉద్యోగిపై జరిగినట్టు చెబుతున్న వేధింపుల వ్యవహారం కార్మిక సంఘాల పాత్రపై తీవ్ర సందేహాలను లేవనెత్తుతోంది. హక్కుల రక్షణ కోసం ఏర్పడిన గుర్తింపు సంఘం నుంచే బెదిరింపులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలతో ఈ వ్యవహారం ఒక్కసారిగా సామాజిక న్యాయం చర్చగా మారింది. ఈ ప్రశ్నలన్నింటికీ కేంద్రంగా నిలిచిన ఘటన కొత్తగూడెం ఏరియా స్టోర్ లోనే చోటుచేసుకుంది. గిరిజన, వికలాంగ ఉద్యోగిపై జరిగినట్టు చెబుతున్న వేధింపుల వ్యవహారం ఇప్పుడు సింగరేణి వ్యవస్థ మొత్తాన్ని కదిలించే అంశంగా మారింది. దీంతో సింగరేణిలో గుర్తింపు సంఘంగా హోదా కల్పించడమన్నది... కొందరు నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించేందుకు కవచంగా మారిందా? అన్న సందేహం ఇప్పుడు కార్మిక వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

• సింగరేణి ప్రతినిధి, ప్రజాజ్యోతి



## నిజం చెప్పే ధైర్యమే...
# ప్రజాజ్యోతి బలం

- ఎస్పీ చాంబర్ లో ప్రజాజ్యోతి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ
- జిల్లా జర్నలిజంలో ప్రజాజ్యోతి పాత్రపై ప్రశంసలు
- 'చైతన్యం' తరహా మరో కార్యక్రమానికి సంకేతం..
- క్యాలెండర్ ఆవిష్కరణలో భాగంగా జిల్లా పోలీస్ బాస్..

**కొత్తగూడెం (క్రైం), జనవరి 12, ప్రజాజ్యోతి:** ఎలాంటి భయాలకు లొంగకుండా నిక్కచ్చగా నిజం చెప్పే ధైర్యమే ప్రజాజ్యోతి అసలైన బలమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్ లో నిర్వహించిన ప్రజాజ్యోతి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల భద్రత కోసం పోలీస్ వ్యవస్థ పనిచేస్తే, ప్రజల గొంతుకను నిర్భయంగా వెలుగులోకి తీసుకెళ్లే బాధ్యత పత్రికలదని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ రెండు సమాంతరంగా నడిచినప్పుడే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం బలపడుతుందని తెలిపారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో ప్రజా సమస్యలు, ప్రజల ఆవేదనలు వెలుగులోకి తేవడంలో ప్రజాజ్యోతి జర్నలిజం

మిగతా 2 లో...

## ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 12, ప్రజాజ్యోతి:** యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి

మిగతా 2 లో...



# 'బెల్ట్ తీసేది ఎవరు?'




2 లో..

- గల్లీకో బెల్ట్ షాప్... మండల వ్యాప్తంగా 300 పైగా దుఖానాలు..
- అడ్డగోలుగా బెల్టు షాపులకు మద్యం విక్రయాలు
- సారపాకలో బస్టాండ్ చుట్టూ బెల్ట్ షాపులే...
- సంబంధిత,ఎక్సైజ్ అధికారుల చర్యలు శూన్యం

బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాకు యదేచ్చగా జరుగుతున్నాయి.ఇటీవల జరిగిన టెండర్ల ప్రకారం దక్కించుకున్న వైన్ షాప్ యజమానులు అక్రమంగా బెల్ట్ షాపులకు అధిక ధరలకు మద్యం విక్రయించి లక్షల రూపాయలు గడిస్తున్నారు. గుడి బడి అనే తేడా లేకుండా యదేచ్ఛగా మధ్యనే విక్రస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువత సామాన్య ప్రజలు మద్యానికి బానిసవుతున్నారనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి బెల్టు దందా కొనసాగిస్తున్నారు.

• బూర్గంపహాడ్, ప్రజాజ్యోతి

# ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం



(మొదటి పేజీ తరువాయి...)

రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టి.జి.ఈ.డబ్ల్యూ. ఐ.డి.సి. ఎండి గణపతి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, టి.జి.ఈ.డబ్ల్యూ. ఐ.డి.సి. అధికారులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో విద్యను అందించి పోటీ ప్రపంచంలో నిలబడేలా తీర్చిదిద్దే ఉద్దేశంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్. సి., ఎస్. టి., బి. సి రెసిడెన్షియల్ పాఠశాలలలా కాకుండా అందరికీ ఒకే చోట ఉమ్మడి కుటుంబంలా సకల సౌకర్యాలతో పాఠశాలలను ప్రతిష్టాత్మకంగా నిర్మించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 79 పాఠశాలలు మంజూరు కాగా 76 పాఠశాలలకు టెండర్లు పూర్తి కాబడి 18 పాఠశాలల్లో పనులు మొదలు పెట్టడం జరిగిందని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి వారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిపై సమీక్ష నిర్వహించాలని, ప్రతి నెలలో కనీసం ఒకసారి పాఠశాలల నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని తెలిపారు. పాఠశాలలు నిర్మాణంలో ఉన్న చోట పనితీరు పురోగతిపై డాష్ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు వి సి సమావేశంలో భాగంగా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 5 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు కాగా, సంబంధిత పాఠశాలలకు భూమిని కేటాయించడం జరిగిందని, టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం, పినపాక, దుమ్ముగూడెం లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అశ్వరావుపేట, ఇల్లందు పాఠశాలల పనులు కూడా త్వరితగతిన మొదలుపెట్టి వచ్చే విద్యాసంవత్సరం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 'బెల్ట్ తీసేది ఎవరు?'

**బూర్గంపహాడ్ జనవరి 12 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండల వ్యాప్తంగా బెల్ట్ షాపుల్లో మధ్యం విక్రయాకు యదేచ్ఛగా జరుగుతున్నాయి.ఇటీవల జరిగిన టెండర్ల ప్రకారం దక్కించుకున్న వైన్ షాప్ యజమానులు అక్రమంగా బెల్ట్ షాపులకు అధిక ధరలకు మధ్యం విక్రయించి లక్షల రూపాయలు గడిస్తున్నారు. గుడి బడి అనే తేడా లేకుండా యదేచ్ఛగా మధ్యనే విక్రస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని యువత సామాన్య ప్రజలు మద్యానికి బానిసవుతున్నారనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి బెల్టు దందా కొనసాగిస్తున్నారు.

**కల్తీ మద్యం విక్రయాలు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిసెంబర్ మొదటి నుండి ఏర్పడిన నూతన వైన్ షాప్ యజమానులు పాత స్థలంలోనే షాప్ బోర్డులోని పేరు మార్చి మరలా వ్యాపారం కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా అధిక ధర ఉన్న బ్రాండ్లలో కల్తీ జరుగుతుందన్న ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. బాటిల్ సీల్ తీయకుండానే మధ్యాన్ని కల్తీ చేసి మరల సీల్ బాటిల్ ఉన్న విధంగానే అమరుస్తున్నారని పలువురు మద్యం ప్రియులు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అధికంగా విక్రయాలు జరిగే బ్రాండ్లను ప్రభుత్వం కేటాయించిన వైన్ షాపులలో కాకుండా బెల్ట్ షాపులకు రూ.20 నుండి రూ.30 వరకు అధిక ధరలకు బెల్ట్ షాపులకు చేరవేరుస్తున్నారని, అనంతరం బెల్ట్ షాప్ యజమాని అదనంగా మరో రూ.30 లాభానికి విక్రయించడం వలన ఎమ్మార్పీ ధరపై సుమారు రూ.50 నుండి రూ.70 అధికంగా విక్రయించడం జరుగుతుంది.దాని వలన నిరుపేద సామాన్య మద్యం ప్రియులు అధిక ధరలకు విక్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఈ తతంగమంతా అధికారుల కనుసన్నల్లోనే..**

మండలంలోని బెల్టు దందా, కల్తీ మద్యం యదేచ్ఛగా జరుగుతుందంటే అధికారుల అండదండలతోనే వారి వ్యాపారం కొనసాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా సంబంధిత ఎక్సైజ్ అధికారులు నిద్రావస్థను వీడి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం వ్యాపారం చేసే యజమానులపై, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# గుర్తింపు హోదా... నేతల ఇష్టారాజ్యానికి కవచమా?

**అసలు ఎం జరిగిందంటే..**

కొత్తగూడెం ఏరియా స్టోర్ లో డిప్యూటీ సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న లకావత్ వెంకటేశ్వర్లు ఈ నెల 5వ తేదీన సంస్థ ఎస్సీ, ఎస్టీ లైజనింగ్ అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై మానసిక వేధింపులు, బెదిరింపులు జరుగుతున్నాయని, ప్రాణహానీ భయం ఉందని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. బాధితుడి వివరాల ప్రకారం, గత ఏడాది డిసెంబర్ 30న విధుల్లో ఉన్న సమయంలో పని అంశంపై వివాదం చోటుచేసుకుంది. దోనబోయిన శ్రీనివాస్ అనే జూనియర్ అసిస్టెంట్ విధులకు సుమారు రెండు గంటలు ఆలస్యంగా వచ్చి మస్టర్ వేయాలని ఒత్తిడి చేసినట్టు వెంకటేశ్వర్లు తెలిపారు. విధి సమయానికి సంబంధించిన గ్రేస్ పీరియడ్ కూడా దాటిపోయినందున హెచ్ ఓడీ వద్ద నుంచి అనుమతి తీసుకురావాలని చెప్పగా, ఆ మాటతో జూనియర్ అసిస్టెంట్ ఆగ్రహానికి లోనయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను ఒక గుర్తింపు పొందిన కార్మిక సంఘానికి చెందినవాడినని, ఈ స్టోర్ కు ఫిట్ సెక్రటరీనని, పైగా ప్రొటెక్టెడ్ వర్క్ మ్యాన్ కేటగిరీలో ఉన్నానని చెప్పుకుంటూ, “నన్నెవ్వరూ ఏమీ చేయలేరు... నా గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే గూగుల్ లో వెతకండి” అంటూ దురుసుగా మాట్లాడినట్టు వెంకటేశ్వర్లు ఆరోపించారు. నా గురించి “నువ్వు ఎవరికీ చెప్పినా ఉపయోగం లేదు... మేము గుర్తింపు సంఘం వాళ్లం” అంటూ నానా మాటలు చెప్పి అవమానించారని ఫిర్యాదులో వివరించారు. అయితే కేవలం ఆ రోజె కాకుండా గత కొంత కాలంగా తరచూ విధులకు ఆలస్యంగా వస్తూ, భయభ్రాంతులకు గురిచేస్తూ, పని వాతావరణాన్ని అసహనంగా మార్చుతున్నారని, దీని వల్ల వెంకటేశ్వర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఒక నేత తప్పిదం.. ఎఐటియుసికి ప్రతిష్ఠ భంగం..**

అయితే ఇక్కడ అత్యంత తీవ్రత కలిగించే అంశం ఏమిటంటే.. ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సింగరేణిలో ప్రస్తుతం గుర్తింపు సంఘంగా ఉన్నా ఎఐటియుసికి చెందిన నేతగా వ్యవహరిస్తుండటం. దీంతో కార్మికుల హక్కుల కోసం సమ్మెలు, పోరాటాలు నిర్వహించాల్సిన సంఘం నుంచే ఈ తరహా ప్రవర్తన ఆరోపణలు రావడం కార్మిక వర్గాల్లో తీవ్ర ఆందోళనకు దారి తీసింది. ముఖ్యంగా ఎఐటియుసి వంటి జాతీయ స్థాయి సంఘానికి చెందిన నేతపై ఈ ఆరోపణలు రావడంతో విషయం మరింత సున్నితంగా మారింది. ఇంకా ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. ఈ వ్యవహారం బయటకు వచ్చినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత సంఘం అధిష్టానం నుంచి ఎలాంటి స్పష్టమైన స్పందన గానీ, మందలింపు గానీ లేకపోవడం. ఒక నేత చేసిన చర్యల వల్ల మొత్తం సంఘం ప్రతిష్ఠ దెబ్బతింటున్నా మౌనం పాటించడం కార్మికుల్లో అనుమానాలు, ఆగ్రహాన్ని పెంచుతోందని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి.

**ప్రశ్నిస్తున్న కార్మికులు..**

ఓ 58 సంవత్సరాల వయస్సు గల గిరిజన, వికలాంగ ఉద్యోగిపై ఈ తరహా వేధింపులు గల అంశము బయటికి రావడంతో కార్మికులు ఇప్పుడు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. “హక్కుల కోసం నిలబడాల్సిన వాళ్లే వేధిస్తే... ధైర్యం చెప్పాల్సిన వాళ్లే బెదిరిస్తే... మేం ఎవరిని ఆశ్రయించాలి?” అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్తింపు సంఘం వచ్చిన తర్వాత కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించామని, కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారిందని వారు చెబుతున్నారు. సమస్యలు పక్కకు నెట్టబడుతున్నాయని, వ్యక్తిగత ఆధిపత్యం పెరుగుతోందన్న భావన బలపడుతోందని అంటున్నారు. ఇలాంటి ఘటనల వల్ల సంఘాల పట్ల నమ్మకం తగ్గుతోందని, కార్మికుల్లో తీవ్ర నిరుత్సాహం నెలకొందని ఆవేదన సైతం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారం ఇతర సంఘాలు కూడా మంది ఒఅదితున్నాయి. ఇది కేవలం ఒక ఉద్యోగి ఫిర్యాదుగా మాత్రమే చూడలేమని, ఇది సంఘాల బాధ్యత, నేతల ప్రవర్తన, కార్మికుల భద్రత అనే మూడింటినీ ప్రశ్నించే అంశమని వాళ్ళు అభిప్రాయపడుతున్నాయి. పైగా ఎస్సీ–ఎస్టీ అంశం కావడంతో నిబంధనల ప్రకారం విచారణ తప్పనిసరిగా జరగాల్సిన పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. దీంతో ఇప్పుడు అందరి దృష్టి రెండు కీలక అంశాలపై నిలిచింది. యాజమాన్యం, ఎస్సీ–ఎస్టీ అధికారులు ఈ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? గుర్తింపు సంఘం అధిష్టానం తమ నేతల ప్రవర్తనపై ఎలా స్పందిస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాకపోతే, కార్మికుల హక్కుల కోసం ఏర్పడిన సంఘాలపై నమ్మకం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు సింగరేణి కార్మిక వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి.

# ప్రజా ప్రయోజనాలే జర్నలిజం లక్ష్యం..

(మొదటి పేజీ తరువాయి...)

క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా ప్రయోజనాలే జర్నలిజం యొక్క అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్న మంత్రి, ప్రజల సమస్యలను నేరుగా వెలుగులోకి తీసుకురావడంలో పత్రికలు పోషిస్తున్న పాత్ర పాలనకు దిశా నిర్దేశం చేస్తుందని అన్నారు. అధికార వ్యవస్థలకు ప్రజల వాస్తవ పరిస్థితిని తెలియజేయడంలో జర్నలిజం కీలక సాధనమని వ్యాఖ్యానించారు. ప్రత్యేకంగా ప్రజాజ్యోతి పత్రిక ప్రజా ప్రయోజనాలను కేంద్రంగా చేసుకుని వార్తలను ప్రజల ముందుకు తీసుకెళ్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఒత్తిళ్లకు లొంగకుండా, వాస్తవాలకు కట్టుబడి ప్రజల పక్షాన నిలబడే జర్నలిజమే ప్రజల విశ్వాసాన్ని సంపాదిస్తుందని అన్నారు. రెవెన్యూ, గృహ నిర్మాణ రంగాల్లో ప్రజలకు సంబంధించిన అంశాలు విస్తృతంగా ఉంటాయని, భూసంబంధ సమస్యలు, నివాస హక్కులు వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా నిర్మాణాత్మక పాత్ర అవసరమని మంత్రి తెలిపారు. ప్రజా సమస్యలను విస్మరించకుండా ప్రశ్నించే ధోరణి పాలనలో పారదర్శకతను పెంచుతుందని స్పష్టం చేశారు. ప్రజాజ్యోతి జర్నలిజం ప్రజా ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తోందని, ఇదే ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల కోసం పనిచేసే పత్రికలు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంలా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కూడా ప్రజాజ్యోతి జర్నలిస్టుల కట్టుబాటు, బాధ్యతాయుత రిపోర్టింగ్ ను ప్రశంసించారు. ప్రజల తరఫున నిలబడి నిజాన్ని చెప్పే జర్నలిజమే సమాజానికి అవసరమని వారు అభిప్రాయపడ్డారు.

# నిజం చెప్పే ధైర్యమే ప్రజాజ్యోతి బలం




(మొదటి పేజీ తరువాయి...)

కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. వాస్తవాలకు కట్టుబడి, ఒత్తిళ్లకు లొంగకుండా నిజాన్ని చెప్పే ధోరణే ప్రజాజ్యోతి అసలైన బలమని మరోసారి అయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు వ్యసనాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పి వినూత్న ఆలోచనతో ప్రారంభమైన ‘చైతన్యం’ కార్యక్రమాన్ని మీడియా బృందం గుర్తుచేసింది. ఆ కార్యక్రమంపై గతంలో ప్రజాజ్యోతి ప్రచురించిన ప్రత్యేక కథనానికి సంబంధించిన ఫోటో ఫ్రేమ్ ను ప్రజాజ్యోతి పత్రిక బృందం ఎస్పీకి అందించారు. ఆ కథనం తనకు గుర్తుందని పేర్కొన్న ఎస్పీ, చైతన్యం కార్యక్రమం పూర్తి ఉద్దేశాన్ని సంపూర్ణంగా ఒకే కథనంలో ప్రజల ముందుకు తీసుకువచ్చిన విధానాన్ని ప్రశంసిస్తూ, ఆ వార్తను రాసిన జిల్లా ప్రతినిధి మాలోత్ అశోక్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆ ఫోటో ఫ్రేమ్ ను పరిశీలించి ఆనందం వ్యక్తం చేస్తూ, చైతన్యం తరహాలో మరో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాలన్న ఆలోచన ఉందని, ఇందుకు మీడియా సహకారం అవసరమని జిల్లా పోలీస్ బాస్ తెలిపారు. అదే సందర్భంగా ప్రజాజ్యోతి పత్రిక పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, పత్రిక యాజమాన్యం, జర్నలిస్టుల పని విధానం, ప్రజలతో ఉన్న అనుబంధం గురించి ఎస్పీ వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం పనిచేసే మీడియా సంస్థలకు పోలీస్ శాఖ నుంచి ఎప్పుడూ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. దీంతో ఈ కార్యక్రమం ఒక క్యాలెండర్ ఆవిష్కరణకే పరిమితం కాకుండా, మీడియా – పాలన – ప్రజల మధ్య విశ్వాసాన్ని మరింత బలపరిచిన వేదికగా నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# క్రికెట్ ఆఫ్ సింగరేణి ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్ 2025

- విజేతగా కొత్తగూడెం రీజియన్ టీం





**కొత్తగూడెం సింగరేణి, జనవరి 12 – ప్రజాజ్యోతి:** కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ నందు గల ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం నందు ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్ (క్రికెట్ ఆఫ్ సింగరేణి ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్) ఫైనల్ మ్యాచ్ కొత్తగూడెం రీజియన్ టీం తో బెల్లంపల్లి రీజియన్ టీం తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన కొత్తగూడెం రీజియన్ టీం 20ఓవర్లకు 05 వికెట్లు కోల్పోయి 175 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించాక బెల్లంపల్లి రీజియన్ టీం 16 ఓవర్లకు 110 పరుగులకు అల్ అవుట్ (10 వికెట్స్) కోల్పోయి ఓడిపోయారు. గత సంవత్సరంలో బెల్లంపల్లి రీజియన్ టీం ఈ ఎగ్జిక్యూటివ్ టోర్నమెంట్ లో గెలుపొందింది మరియు 2025 సంవత్సరంలోనీ ట్రోఫీ కూడా విజేతగా నిలిచి ఉంటే రెండు పర్యాయాలు విజేత నిలిచింది, 2025 సంవత్సరంలో నిర్వహించిన టోర్నమెంట్ లో కూడా విజేతగా నిలిచినట్లయితే క్రీసెట్ టోర్నమెంట్ ట్రోఫీని మూడు పర్యాయాలు గెలిచిన టీంగా అర్హత పొంది ట్రోఫీని అందకుని ఉండేది కానీ కొత్తగూడెం రీజియన్ వారు ఈ సంవత్సరం గెలుపొందడంతో ట్రోఫీ ని బెల్లంపల్లి రీజియన్ టీం కు చెందకుండా చేశారు. ఈ కార్యక్రమము కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు అధ్యక్షతన, ముఖ్య అతిథిగా సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) శ్రీ కే.వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథిగా డైరెక్టర్ (ఈ & ఎం), ఎం. తిరుమల రావు విచ్చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), డైరెక్టర్ (ఈ & ఎం) ఎం. తిరుమల రావు గారు క్రెసిట్ క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ మరియు రన్నర్స్ టీం లకు బహుమతులను బహూకరించారు అలాగే ఎగ్జిక్యూటివ్ టీం మరియు సీనియర్ ఎగ్జిక్యూటివ్ టీం ల పోటీల యందు కూడా కొత్తగూడెం అండ్ కార్పొరేట్ రీజియన్ టీం గెలుపొందింది. రన్నర్ ఆఫ్ టీం గా బెల్లంపల్లి అండ్ రామగుండం రీజియన్ టీం నిలిచారు. అలాగే మహిళా ఎగ్జిక్యూటివ్ టీంలలో కొత్తగూడెం ఏరియా మహిళా ఎగ్జిక్యూటివ్ విజేతగా నిలవగా సత్తుపల్లి మహిళా ఎగ్జిక్యూటివ్ టీం రన్నరప్ గా నిలిచింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ గారితో పాటు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు, జిఎం (సిపిపి) మనోహర్, జిఎం (ఫైనాన్స్) ఎం. సుబ్బారావు, కొత్తగూడెం ఏరియా ఎస్. ఓ. టు జిఎం జీవి కోటిరెడ్డి, కొత్తగూడెం ఏరియా సిఎంఓఎఐ ప్రెసిడెంట్ ఎం.వి. నరసింహారావు, కే.వి జయ వెంకటేశ్వర్లు, జి. మధురవాణి షాలేం రాజు, కమిటీ మెంబర్ పాలడుగు శ్రీనివాస్, ఎజిఎం (సివిల్) సిహెచ్ రామకృష్ణ ఎజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు ఇతర విభాగాధిపతులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## ఆటోలను నిర్లక్ష్యంగా నడిపితే కఠిన చర్యలు

- వాహనాలు తప్పనిసరిగా కాగితాలు ఫోర్సులో ఉండాలి
- ఆటో డ్రైవర్లకు లైసెన్సులు, యూనిఫామ్ లేనిచో కఠిన చర్యలు తప్పవు



**టేకులపల్లి, జనవరి 12, ప్రజాజ్యోతి:** ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ ఆటోలను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ హెచ్చరించారు. టేకులపల్లి బోడు ఆటో డ్రైవర్లు, సంఘాల నాయకులకు సోమవారం అవగాహన కల్పించారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ అంతరాయాన్ని నియంత్రించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఇల్లందు, టేకులపల్లి, కొత్తగూడెం ప్రధాన రోడ్లలో నడుపుతూన్న ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎకించవద్దని, వారితో మర్యాదగా మెలగాలని, అతి వేగంతో నడపొద్దని, ఎక్కడపడితే అక్కడ ఆపొద్దని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే అకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లంతా తప్పని సరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్–ఆర్‌సీ ఉంచుకోవాలని చెప్పారు. ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్ కనబడేలా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు తమ ఆటోలను నడిపే సమయంలో తప్పకుండా నిబంధనలు పాటించి ప్రజల మన్ననలు పొందాలని సీఐ అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోలను నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తమ వెనక కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారని గుర్తుపెట్టుకుని ఆటోలు సురక్షితంగా నడుపు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ సక్రు, కానిస్టేబుల్ రవి, శివ తదితర సిబ్బంది, ఆటో డ్రైవర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల అభీష్టం మేరకే అభివృద్ధి పనులకు శ్రీకారం

- వార్డుల అభివృద్ధితోనే గ్రామాభివృద్ధి సాధ్యం
- బూర్గంపహాడ్ గ్రామ సర్పంచ్ మందా నాగరాజు



**బూర్గంపహాడ్, జనవరి 12 (ప్రజా జ్యోతి):** ప్రజల అభీష్టం మేరకే బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. సోమవారం పంచాయతీ పరిధిలోని రామాలయం పరిధిలోని వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ పంచాయితీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని ఆయన తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించ బడినప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆయన అన్నారు. తద్వారా గ్రా మపంచాయతీ అభివృద్ధి చెందుతుందని ఆ యన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేరుస్తామని ఆయన తెలిపారు. ప్రతి వార్డుల్లో ప్రతి సోమవారం నెలకొన్న సమస్యల ను తెలు సుకుని వాటిని పరిష్కరించేందుకు పాలకమం డలి కృషి చేస్తుందని ఆయన తెలిపారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఈ పంచాయతీని అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గుండె వెంకన్న, పాలక మండల సభ్యులు రామకృష్ణ, కేసుపాక ప్రవళిక, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, కాంగ్రెస్ పార్టీ బి–బ్లాక్ కన్వీనర్ బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్ కుమార్, పాషా, పుట్టి లక్ష్మీనారాయణ గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లౌకికశక్తులతోనే ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణ

- ఉద్యమ స్ఫూర్తితో మరో వందేళ్లు ముందుకు
- సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే సాబీర్ పాషా



**బూర్గంపహాడ్, జనవరి12 (ప్రజా జ్యోతి):** నానాటికి ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యం, అభాసు పాలవుతున్న రాజ్యాంగ పరిరక్షణ లౌకిక శక్తులతోనే సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక సిపిఐ కార్యాలయం లో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం ముప్వ వెంకటేశ్వర రావు (లడ్డ) అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సాబీర్ పాషా మాట్లాడుతూ అంతరాలు లేని సమ సమాజ స్థాపనే సిపిఐ ధ్యేయం అని చెప్పారు. 1925లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ ఆ దిశగా పయనిస్తూ నూరేళ్లు పూర్తి చేసుకుందని, రానున్న మరో వందేళ్లు కూడా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు. దేశంలో మత చాందస వాదం హెచ్చు మీరుతోందని, కులాలు మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని వినాశనం వైపు నడిపిస్తుందన్నారు. అంతరాలు లేని సమాజం ఏర్పడాలంటే కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమని ఇందుకు ప్రతి కమ్యూనిస్టు పాటుపడాలని కోరారు. సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రపంచ దేశాల నుండి ప్రతినిధులు తరలి వస్తున్నారని, జిల్లా నలుమూలల నుండి శత వసంత ఉత్సవ ముగింపుకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వీశంశెట్టి, పూర్ణచంద్ర రావు, కమటం వెంకటేశ్వర్లు, ఉప్పు శెట్టి రాహుల్, ఫహీమ్, ఉదయ భాస్కర్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి

**కొత్తగూడెం జనవరి 12 (ప్రజా జ్యోతి):** కొత్తగూడెంలోని శారద కుటీర్ ప్రాంగణంలో గల సేవ భారతి వివేకానంద యువ కేంద్రం నందు అధ్యక్షులు సరంజన అగర్వాల్ మరియు సెక్రటరీ పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మెండు రాజమల్లు (స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కొత్తగూడెం) వివేకానంద జీవిత చరిత్ర గురించి తెలుపుతు నేటి సమాజం సన్మార్గంలో నడవాలి, విలువలతో జీవించాలి అన్న, వివేకానంద బోధించిన ధర్మ మార్గమే అత్యున్నతమైనది గా తెలియ చేశారు. ప్రపంచం లోనే ఉపయోగ కరమైన జనాభా యువత అత్యధికంగా కలిగిన దేశం భారత దేశం అని దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అంటే యువతే ప్రధానం అని కొనియాడరు. అనంతరం ముఖ్య వక్త చేపూరి రామచంద్ర రావు (ఖమ్మం విభాగ్ కార్యవహ) ప్రపంచానిక జ్ఞాన జ్యోతుల తో నింపిన స్వామి వివేకానంద మన దేశంలో జన్మించటం ప్రతి యొక్క భారతీయుడికి గర్వకారణం అని, అలాంటి ధర్మాత్ములు నడిచిన నేటి బాలలకు తెలియచేయాలి, దత్తుడి జీవిత చరిత్ర ప్రతి యొక్క విద్యార్థి చదవి సమాజం లో నైతిక విలువలు, సామాజిక విలువలు కలిగి ఉన్నత పౌరులుగా ఎదగాలి అని సూచించారు. కార్యక్రమం అనంతరం వచ్చిన ప్రతి ఒక్కరికి జ్ఞాన ప్రసాదంగా స్వామి వివేకానంద భారత జాతికి ఆశ జ్యోతి అని పుస్తకం తో పాటు మిఠాయి ను అందించారు. ఈ కార్యక్రమం లో భాగంగా పిల్లి రాజేశ్వరరావు, జి.సత్యనారాయణ, మూర్తి, న్యాయవాదులు రాంప్రసాద్ రావు, వేణు వాసురావు, కృష్ణప్రసాద్, లావణ్య, రమేష్‌నాయక్, అత్తులూరి మనిష్, నాగేశ్వర రావు, శ్రీధర్, సురేష్ (వారాహి), కమిటీ సభ్యులు చందర్ రావు, వెంకటేష్, మదన్ రెడ్డి, పుర ప్రముకులు, యువకులు పాల్గొన్నారు.



## లక్ష్మీపురం అభివృద్ధి పనులు



**ఆళ్ళపల్లి. జనవరి12. ప్రజా జ్యోతి:** మండల పరిధిలోని ఆళ్లపల్లి గ్రామపంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. సర్పంచ్ వాసం సుస్మిత ఆధ్వర్యంలో గ్రామంలోని సీసీ రోడ్లకు ఇరువైపులా గ్రావెల్ పోయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్.డి. ఆరీఫ్, పంచాయతీ సెక్రటరీ శిరీష, వార్డు సభ్యులు పూనెం మంగయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసం శ్రీకాంత్, మరియు గ్రామ పెద్దలు ఎట్టి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసం సుస్మిత మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న ప్రతి సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వీధి దీపాలు, డ్రైనేజీ మరియు పారిశుధ్య పనుల నిర్వహణపై నిరంతరం నిఘా ఉంచుతాం. గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, సహకరించాలని కోరారు.

## సోషల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ వర్కర్ల జీతాలు విడుదల చేయాలి

- ఐఎఫ్టియు ప్రదర్శన నిరసన కార్యక్రమం




**కొత్తగూడెం జనవరి 12 (ప్రజాజ్యోతి ):** జిల్లాలో పనిచేస్తున్న సోషల్ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ వర్కర్ల వేతనాలు గత 12 నెలలుగా రావడంలేదని వేతనాలను విడుదల చేయాలని కోరుతూ కొత్తగూడెం రైటర్ బస్తి ఐఎఫ్ఎస్సి కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 12 నెలలుగా పనిచేసిన కార్మికులకు వేతనాలు లేకపోవడం వలన వారు అర్ధాలతో అలమటిస్తున్నారని వేతనం తక్షణమే విడుదల చేయాలని అన్నారు. సోషల్ వెల్ఫేర్ కు ప్రభుత్వానికి మధ్యలో ఉన్న ఏజెన్సీ టెండర్లను ఏజెన్సీలను రద్దు చేయాలని డైరెక్ట్ ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని జీవో నెంబర్ 60 వర్తింపజేయాలని పిఎఫ్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఏజెన్సీలు సంవత్సరకాలంగా వేతనాలు ఇవ్వడం లేదని హాస్టల్స్లో వర్కర్లకు హాజరు పట్టిక అమలు చేయడం లేదని ఐడి కార్డులు లేవని వాళ్ళకి ఎలాంటి భద్రత లేదని తక్షణమే వారికి ఉద్యోగ భద్రత సౌకర్యం కల్పించాలని ఇవి అమలు చేయాలని ఏజెన్సీలను రద్దుచేసి ఇన్ని రోజులు శ్రమ దోపిడీ చేసి దోచుకున్న ఏజెన్సీలు కార్మికుల జీతాల డబ్బును తిరిగి ఎకౌంట్లో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు భూమా, విజయ,వెంకటమ్మ, సరోజ,మాధవి, రమణ, శాంతమ్మ,నరసింహారావు,చంద్రయ్య,రేణుక, రాణి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

**ఇల్లందు, జనవరి 12, ప్రజాజ్యోతి:** ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదికొండ శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రిజర్వేషన్ల పరంగా కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చినా ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీ అభ్యర్థుల కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించినట్లు గోదికొండ శ్రీదేవి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వాటిని వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్లెం కోటిరెడ్డి, శివరాత్రి ఎల్లయ్య, ఈర్యా నాయక్, ఐజాక్, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



# కీసరి సీతారాం రెడ్డికి నివాళులర్పించిన మంత్రి పొంగులేటి

- కిరణ్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి దంపతులు
- కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటా పొంగులేటి





**చంద్రుగొండ జనవరి 12 ప్రజా జ్యోతి** మంత్రి సమీప బంధువు ఇటీవల వృద్ధాప్యంతో బాధపడుతూ మృతి చెందిన కీసరి సీతారాం రెడ్డికి రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు నివాళులర్పించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండల కేంద్రంలోని మంత్రి పొంగులేటి సమీప బంధువు కీసర సీతారాం రెడ్డి, ఈనెల రెండవ తేదీన వృద్ధాప్యంతో బాధపడుతూ మృతి చెందారు. సోమవారం చంద్రుగొండ మండల కేంద్రంలో సీతారాంరెడ్డి దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని సీతారాం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం కిరణ్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా తనకు నేరుగా తెలియజేయాలని సూచించారు. అనంతరం అక్కడికి వచ్చిన బంధువులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, మండలాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సీతారాం రెడ్డికి నివాళులర్పించారు.

## గుండాల సీఐగా తిరుపతి



**గుండాల జనవరి 12 ప్రజా జ్యోతి:** గుండాల సర్కిల్ ఇన్స్పెక్టర్గా ఎస్ తిరుపతి బాధ్యతలు స్వీకరించారు సోమవారం గుండాల పోలీస్ స్టేషన్లో సీఐ గా పదవీ బాధ్యతలు చేపట్టారు. గుండాలలో పనిచేసిన లోడిగా రవీందర్ బయ్యారం బదలిపై వెళ్లగా గుండాలకు సీఐగా ఎస్ తిరుపతి బదిలీపై గుండాలకు వచ్చారు ఈ సందర్భంగా సిఐ తిరుపతి మాట్లాడుతూ ప్రజలకు న్యాయపరమైన ఏ సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని గ్రామాలలో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు తెలియజేయాలని తద్వారా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు ప్రజలు పోలీసులకు సహకరిస్తూ స్నేహంగా ఉండాలని పోలీసులకు ప్రజలకు మధ్య స్నేహ సంబంధాలు ఉండాలన్నారు మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలి

- వివేకానంద ఉచిత కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు
- హాజరైన ఎంపీఓ వెంకటేశ్వరరావు



**పినపాక,జనవరి 12(ప్రజాజ్యోతి ):** స్వామి వివేకానంద ఆలోచనలు, ఆదర్శాలు భారతదేశ యువతకు ఉన్నత లక్ష్యాల సాధనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పినపాక ఎంపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం పినపాక మండలం ఈ బయ్యారంలో గల శ్రీ వివేకానంద ఉచిత లైబ్రరీ కోచింగ్ సెంటర్ వద్ద జరిగిన వివేకానంద జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వివేకానంద ఉచిత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీరామ్ బృహస్పతి తో కలిసి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని యువత ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. స్వామి వివేకానంద స్వరం శతాబ్ధం దాటినా నేటికీ ఆ మాటలు యువకుల హృదయంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అశోక్, ఉపాధ్యాయులు భద్రయ్య, అనుమాటి వెంకటేశ్వర్లు, రాము, విద్యార్థులు నివేదన్, లతా పాల్గొన్నారు.

## ఆర్.జె. హవాయి స్టీల్ డోర్ షాపు ను ప్రారంభించిన మంత్రి



**కొత్తగూడెం సింగరేణి, జనవరి 12 – ప్రజాజ్యోతి:** సోమవారం రోజున ఎస్సీ నగర్ హైవే మెయిన్ రోడ్డు మెట్టు గార్డెన్స్ ఎదురు ఆర్.జె హవాయి స్టీల్ డోర్స్ షాప్ యజమాని ఎం.డి పాషా జునైద్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్ ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, షాపును ప్రారంభించారు, వారితో పాటు మరో ముఖ్య అతిథి ఉమ్మడి ఖమ్మం జిల్లా మెంబర్ అఫ్ పార్లమెంట్ ( ఎం.పీ ) రామ సహాయం రఘురాం రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, కోనేరు సత్యనారాయణ, కంచర్ల చంద్రశేఖర రావు, పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఐఎన్టియుసి, పిట్ సెక్రటరీ లు, సెంట్రల్ కమిటీ, బ్రాంచ్ కమిటీ, ట్రెజరర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళ నాయకురాళ్లు , మిత్రులు శ్రేయోభిలాషులు భారీ ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సహజ కవికి పురస్కారం

- బత్తుల వెంకటేశ్వర్లకు తెలుగు సాహిత్య మంజరి పురస్కారం

**చర్ల, జనవరి 12: (ప్రజా జ్యోతి ):** సంక్రాంతి సంబరాల సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా భద్రాచలంలో కళా రత్నాలు, ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన పురస్కారాల లో చర్లకు చెందిన ప్రముఖ సహజ కవి బత్తుల వెంకటేశ్వర్లకు, "తెలుగు సాహిత్య మంజరి పురస్కారం "లభించింది. దీన్ని ప్రముఖ సాహితీవేత్త తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు తాళ్లూరు పంచాక్షరయ్య, విద్యావేత్త సిద్దులు, చేతులు మీదుగా అందుకున్నారు. తెలుగు సాహిత్య మంజరి పురస్కారం అందుకున్న బత్తుల వెంకటేశ్వర్లకు, ప్రముఖ కవి, సాహితీవేత్త, రచయిత, మాల్య శ్రీ, గౌతమి నవ్య సాహిత్య అధ్యక్షులు శ్రీ చింతూరు వెంకటరావు, కళా రవళి అధ్యక్షులు నీలి నందు బాబు, ప్రముఖ సామాజిక సేవా తత్పరులు " మీకోసం మేమున్నాం " అధ్యక్షులు నీలి ప్రకాష్, విశ్రాంతి ఉపాధ్యాయులు సాహితీ ప్రోత్సాహకులు, బి వి ఎస్ ఎన్ ఎల్ నరసింహారావు. దొడ్డి తాతారావు, ప్రముఖ ఉపాధ్యాయులు, అభినందనలు తెలియజేశారు



# ఘనంగా వివేకానందుని జయంతి




**చర్ల, జనవరి 12 (ప్రజా జ్యోతి ):** చర్లలో సోమవారం వివేకానంద జయంతి సందర్భంగా వనవాసి కళ్యాణ పరిషత్ కొమరం భీమ్ విద్యార్థి నిలయంలోని వివేకానందుని జయంతి సందర్భగా విగ్రహానికి పూలమాలలు వేసి వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత జ్యోతి ప్రజ్వలన చేసారు . ఈ సందర్భంగా కొండల రావు మాట్లాడుతూ గొప్పతత్వవేత్తలు, ఆధ్యాత్మిక నాయకులలో ఒకరైన వివేకానందుని స్మరించుకోవడం ఆనంద దాయకం అన్నారు. రామకృష్ణ పరమ హంస శిష్యునిగా వేదాంత యోగతత్వ శాస్త్రములతో సమాజంపై అత్యంత ప్రభావం కలిగిన ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక నాయకుడు వివేకానందుడని పేర్కొన్నారు. దేశాన్ని జాగృతం చేయడమే కాకుండా అమెరికా, ఇంగ్లాండ్ లలో యోగ వేద శాస్త్రములను తన ఉపన్యాసాలు, వాదనల ద్వారా పరిచయం చేసి భారతదేశ గొప్పతనాన్ని విదేశాలలో చాటిన మహనీయులన్నారు. ఆయన వాగ్దాటికి మంత్ర ముగ్ధులైన అమెరికా ప్రజానీకం బ్రహ్మారథం పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పాశ్చాత్య దేశాలలోకి అడుగుపెట్టిన మొట్ట మొదటి హిందూ సన్యాసి అయిన వివేకానందుడు చేసిన ప్రసంగాలు భారత దేశంతో పాటు ఇతర దేశాలను సైతం ఉర్రూతలూగించాయని పేర్కొన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి యువతకు దిశా నిర్దేశం చేశారన్నారు. 39 సంవత్సరాల వయసులోనే వివేకానందుడు పరమపదించటం బాధాకరమన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా జనవరి 12వ తేదీన జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా గురుదేవ్ విద్యాలయం లో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఆకుల లిఖిల వివేకానందునిపై చేసిన అనర్గళ ప్రసంగం ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా వమవాసీ విద్యార్ధి రవ్వా లక్ష్మణ్ వేసిన వివేకానందుని వేషధారణ ఆకట్టుకుంది. వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ, ప్రఖండ ప్ర ముఖ్ గొంది శోభన్ బాబు, నిలయ క మిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాద్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, సాగర్, భాణు, మీసాల శ్రీనివాస్, పెద్దాడ సాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

## కష్టజీవుల గుండెల్లో నిలిచిన నాయకుడు పుండరీకాక్ష శాస్త్రి ... సీపీఎం పార్టీ




**దమ్మపేట, జనవరి. 12, (ప్రజాజ్యోతి):** సీపీఎం పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అధ్యక్షతన, సీపీఎం పార్టీ అమరజీవి కామ్రేడ్ చామర్తి పుండరీకాక్ష శాస్త్రి 30వ వర్ధంతిని పురస్కరించుకుని సీపీఎం పార్టీ మండల కార్యాలయం సుందరయ్య భవన్లో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డా లక్ష్మీనారాయణ పుండరీకాక్ష శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మోరంపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని నమ్మి ఎర్రజెండాను భుజాన వేసుకుని జీవితమంతా కష్టజీవుల కోసం పోరాడిన మహనీయుడు పుండరీకాక్ష శాస్త్రి అని కొనియాడారు.కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిన ఆయన దమ్మపేట మండలంలో సీపీఎం పార్టీ తొలి మండల కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. పట్టణంలో అర్బన్ కాలనీ ఏర్పాటు సమయంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పౌరోహిత్యం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదలకు పంచిపెట్టిన గొప్ప మానవతావాదిగా ఆయనను స్మరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ దమ్మపేట టౌన్ కార్యదర్శి కొప్పుల శ్రీనివాసరావు, బోగ్యం నరసింహారావు, కొలిక్కి పోగు శ్రీనివాసరావు, కామినేని రమేష్, శీలం శ్రీనివాసరావు, కే. రాజు బిరాజు, కే. ప్రసాద్, గోపాల రావు, సత్యనారాయణ, మల్లా సత్యం. పుండరీకాక్ష శాస్త్రి కుమారుడు చామర్తి సాయి ప్రసాద్ శాస్త్రి పాల్గొన్నారు.

## 11.300 కేజీల ఎండు గంజాయి స్వాధీనం



**భద్రాచలం, జనవరి 12,ప్రజాజ్యోతి :** భద్రాచలంలో సోమవారం ఎక్సైజ్ ఎన్ఫోర్సుమెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 11.300 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.కూనవరం రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది.విచారణలో ఈ గంజాయిని ఒడిశా రాష్ట్రం కలిమెల ప్రాంతం నుంచి భద్రాచలానికి తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మణుగూరు, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందినబాహ్యావరపు వరప్రసాద్, నల్లపు కళ్యాణ్, బోడ తరుణ్ తేజ, వాగే సాయి చరణ్లను అదుపులోకి తీసుకొని భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్కు తరలించారు.పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7.60 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.ఈ తనిఖీల్లో ఎస్సై శ్రీహరి రావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.ఎ. కరీం, కానిస్టేబుళ్లు సుధీర్, వెంకట్, హరీష్, వీరబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సాగిన ముగ్గుల పోటీలు

**భద్రాచలం, జనవరి 12,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని గొల్లబజారులో సోమవారం సీపీఎం నాయకులు బండారు శరత్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు.పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బండారు శరత్బాబు మాట్లాడుతూ, ముగ్గుల పోటీల ద్వారా మహిళల్లో ఐక్యత, చైతన్యం పెంపొందుతాయని తెలిపారు. అలాగే ఆడపిల్లలను సముచితంగా ప్రోత్సహిస్తే వారు సాధించలేనిది ఏమీ లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో కె. లక్ష్మి, పి. సునీత, శైలజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



## మెగా రక్తదాన శిబిరం

- స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం
- రక్తదానం చేసిన 30 మంది




**చర్ల, జనవరి 12(ప్రజా జ్యోతి ):** చర్ల లో సోమవారం జనవరి 12 ప్రపంచ ఆధ్యాత్మిక వేత్త, తత్త్వవేత్త స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ , మీకోసం మేమున్నాం కమిటి, లయన్స్ క్లబ్ ఆఫ్ చర్ల హెల్పింగ్ హ్యాండ్స్ , నితిక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో తల సేమియా సికిల్ సెల్ అనీమియా తో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు .ఈ రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మీకోసం మేమున్నాం సంస్థ అధ్యక్షులు నీలి ప్రకాష్ , ట్రస్ట్ వ్యవస్థాపకులు చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ మన ఏజెన్సీ ప్రాంతంలో చాలామంది గర్భిణీ స్త్రీలు, తలసేమియా సికిల్ సెల్ అనీమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సరైన సమయంలో రక్తం దొరకక ఇబ్బంది పడుతుండటంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నేటికి ప్రతీ రోజు సరియైన సమయంలో రక్తం దొరకక చనిపోతున్న పరిస్థితులు ఉన్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మను ప్రసాదించడం ఒక్క రక్తదానంతోనే సాధ్యమని అన్నారు. ఈ రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారని తెలిపారు. అలాగే మహిళలు కూడా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు అని అన్నారు . తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులు 15 రోజులకు ఒకసారి నెలకు ఒక సారి రక్తం ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఉందని ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చిన్నారులను ఆదుకోవాలని కోరారు.అడగగానే స్పందించి రక్తదానం చేసిన రక్తదాతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించి అనంతరం రక్తదాతలకు ప్రశంస పత్రాన్ని లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మీ కోసం మేమున్నాం కమిటి అధ్యక్షులు నీలి ప్రకాష్లయన్స్ క్లబ్ ఆఫ్ చర్ల హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు జి.కిరణ్ , సామ్యూల్ , శ్రీకర్ వంశీ,నితిక ఫౌండేషన్ నిర్వాహకులు నిఖిల్, సౌజన్య, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ ఆదినారాయణ , భద్రాద్రి బ్లడ్ సెంటర్ టెక్నీషియన్ చందు , చింటు సాయి కిరణ్ , జితేంద్ర , పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్రాజు

**భద్రాచలం, జనవరి 12,ప్రజాజ్యోతి :** అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీవో) జనరల్ డేవిడ్రాజు అన్నారు.సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి ఆయన వినతిపత్రాలను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపిస్తూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.గిరిజనులు సమర్పించిన అర్జీలలో పోడు భూముల సమస్యలు, పోడు భూముల పట్టాల మంజూరు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, జీవనోపాధి పెంపొందించుకునేందుకు వ్యక్తిగత రుణాలు, వ్యవసాయ భూములకు విద్యుత్ మోటార్లు, గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, కుటుంబ పోషణకు జీవన భృతి, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆర్థిక సహాయం, కులాంతర వివాహ ప్రోత్సాహకం, సౌర గిరిజల విద్యుత్ ద్వారా బోర్లు–మోటార్లు మంజూరు వంటి అంశాలు ఉన్నట్లు తెలిపారు.గిరిజన దర్బార్లో వచ్చిన అన్ని అర్జీలను ప్రత్యేక రిజిస్టర్లో నమోదు చేసి, ఆన్లైన్ ప్రక్రియ పూర్తి చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని ఏపీవో జనరల్ డేవిడ్రాజు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏవో సున్నం రాంబాబు, డీటీఆర్ఓ ఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, జేడీఎం హరికృష్ణ, హౌసింగ్ ఏఈ హేమంత్తో పాటు వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ప్రమీల బాయి, నరేందర్, మోహన్, జోగారావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



## షేక్ ఇమామ్ కుటుంబానికి ఆర్థిక సాయం



**ఇల్లందు టౌన్, జనవరి 12, ప్రజాజ్యోతి:**పట్టణంలోని 14వ వార్డుకు చెందిన షేక్ ఇమామ్ కొద్ది రోజుల క్రితం మృతి చెందడంతో సోమవారం మాజీ ప్రిన్సిపాల్ పరుచూరి వెంకట్రావు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు కలిసి రూ. 21, 500ల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇమామ్ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది జగన్, బాబ్జి, భూపాల్, రాములు, పూర్వ ఇంటర్ విద్యార్థులు పెండే కట్ల యాకయ్య దొర, మధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు



**భద్రాచలం, జనవరి 12,ప్రజాజ్యోతి :**భద్రాచలంలో శ్రీ స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రాచలం మోటార్ వాహనాల విభాగం ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. స్వామి వివేకానంద జీవితం, బోధనలను స్ఫూర్తిగా తీసుకొని పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మారుతి కాలేజ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు, తాళ్ళూరి పంచాక్షరయ్య, బీజేపీ నాయకుడు కుంజా ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా దూసుకొచ్చిన కారు ఢీ... మహిళ మృతి

**దమ్మపేట, జనవరి. 12, (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలం, ముష్టిబండ గ్రామ పరిధిలోని రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి క్రైం నెం.07/2025, సెక్షన్ 106(1) బి.యన్.యస్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం...జనవరి 11న సాయంత్రం 6.30 గంటల సమయంలో సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట దిశగా వెళ్తున్న షిఫ్ట్ కారు (ఏపీ–40 డీఎన్–4652) ను వోడూరి గణేష్ , గోపాలపురం గ్రామం, రావులపాలెం మండలం, కోనసీమ అంబేద్కర్ జిల్లా (ఏపీ)కు చెందిన వ్యక్తి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల, అదే సమయంలో ముష్టిబండ గ్రామానికి చెందిన కోలికపోగు రేణుకమ్మ (58) రహదారి దాటుతున్న క్రమంలో కార్ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమెకు తల, కాళ్లు, చేతులకు తీవ్ర రక్తస్రావ గాయాలు అయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు కోలికపోగు ప్రకాశ్‌రావు, తల్లి ని వెంటనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందించే సమయంలో వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దమ్మపేట ఎస్. ఐ సాయి కిశోర్ రెడ్డి తెలిపారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్లు చోరీ

**దమ్మపేట, జనవరి. 12, (ప్రజాజ్యోతి):** దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్బన్ కాలనీ సరిహద్దులలో గుర్తు తెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్లు చోరీ చేశారు. ఈ ఘటనకు సంబంధించి క్రైం నెం.08/2026, సెక్షన్ 305(ఇ) బి.యన్.యస్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.జనవరి 11 సాయంత్రం నుంచి జనవరి 12 తెల్లవారుజామున మధ్యలో జరిగిన ఈ ఘటనలో నాలుగు ప్రభుత్వ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి మొత్తం 60 కిలోల కాపర్ వైర్లు దొంగతనం కాగా, వాటి విలువ సుమారు రూ. 80 వేలుగా అంచనా వేశారు. విద్యుత్ శాఖ ఏఈ అంబడిపూడి సాయి కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ముగ్గుల మురిపెం.. సంక్రాంతి సంబరం!

- టేకులపల్లి లో అట్టహాసంగా 'ముగ్గుల పోటీలు'
- సృజనాత్మకతకు అద్దం పట్టిన రంగురంగుల రంగవల్లులు
- విజేతలకు బహుమతులు అందజేసిన కోరం ఉమా





**టేకులపల్లి, జనవరి12, ప్రజాజ్యోతి:** ముగ్గులు మన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని కోరం ఉమా అన్నారు. కోయగూడెం మాజీ సర్పంచ్ కోరం ఉమా మాట్లాడుతూ మహిళల సృజనాత్మకత, కళాత్మకత ముగ్గుల రూపంలో ప్రతిఫలిస్తోందని పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ సంస్కృతిని కాపాడటంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. తెలుగు లోగిళ్లలో సంక్రాంతి వెలుగులు ముందే వచ్చాయి అని అన్నారు.టేకులపల్లి గ్రామపంచాయతీలోని బొడ్రాయి సెంటర్ లో సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు కనులవిందుగా సాగాయి. టేకులపల్లి బొడ్రాయి సెంటర్, ఆరో వార్డు, యూత్ ఆధ్వర్యంలో టేకులపల్లి బొడ్రాయి సెంటర్లో లో జరిగిన ఈ మెగా పోటీలకు మహిళలు రంగురంగుల రంగవల్లులతో వీధులను ఇంద్రధనుస్సులా మార్చేశారు. విజేతలకు పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు కోరం ఉమా చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి: ధరావత్ స్వాతి(మిక్సీ), ద్వితీయ బహుమతి:మేకల స్టెల్లా(రైస్ కుక్కర్), తృతీయ బహుమతి: భూక్యా ఉష (సీలింగ్ ఫ్యాన్), నాల్గవ బహుమతి: భూక్య ప్రణతి (1116), ఐదవ బహుమతి: తవ్వోజు ఉమా (516), ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందజేశారు.ఈ ముగ్గుల పోటీలు మన సంస్కృతికి అద్దం పడుతున్నయి.మొదటి బహుమతి అందజేసిన కోరం ఉమా సురేందర్, రెండో బహుమతి అందజేసిన నోముల భానుచందర్, మూడో బహుమతి అందజేసిన సుగ్గాల గోపి,నాలుగో బహుమతి అందజేసిన ఉప్పు దీప్తి, ఐదో బహుమతి ధారావత్ సురేష్ బాబు బహుమతులు అందజేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆరో వార్డు మెంబర్ మూడ్ గణేష్, నోముల భానుచందర్,ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ నాయక్,ధరావత్ సురేష్ బాబు , భూక్యా ఉష,ధరావత్ కొక్య,తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, జనవరి 12, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సోమవారం హైదరాబాదులోని వారి స్వగృహంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముందస్తుగా సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఇల్లందులో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని, అందుకు పార్టీ శ్రేణులు అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక సర్పంచ్ స్థానాలను గెలిపించినందుకు కృషి చేసిన ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులను సీఎం అభినందించారు.

## కేంద్ర పథకాల కోసం రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- యూరియా కొరత లేదు - మండల వ్యవసాయ అధికారి

**దమ్మపేట, జనవరి. 12, (ప్రజాజ్యోతి):** వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ను తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు వద్ద, అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రాల ద్వారా రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేయబడతాయని తెలిపారు.అదేవిధంగా దమ్మపేట మండలంలో యూరియా ఎరువుల కొరత లేదని మండల వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. ప్రస్తుతం దమ్మపేట విశాల సహకార సంఘంలో 2,000 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతిరోజూ రైతులకు పంపిణీ చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. రైతులు యూరియాను పంట అవసరానికి అనుగుణంగా తగిన మోతాదులో మాత్రమే వినియోగించుకోవాలని మండల వ్యవసాయ శాఖ విజ్ఞప్తి చేశారు.

## పెద్దిరెడ్డిగూడెంలో క్షయ వ్యాధి నివారణ వైద్య శిబిరం

- 2025 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వ కార్యక్రమం





**అన్నపురెడ్డిపల్లి, జనవరి 12, (ప్రజా జ్యోతి):**క్షయ వ్యాధి నివారణ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలం పెద్దిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నాగభూషణం ప్రారంభించారు.ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆధునిక మొబైల్ ఎక్స్‌రే యంత్రం ద్వారా గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన 60 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 15 మందిని ప్రాథమికంగా క్షయ అనుమానితులుగా గుర్తించారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం, దగ్గుతో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.అనుమానితులకు కళ్ళె మరియు రక్త పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా చికిత్స, మందులు అందిస్తామని తెలిపారు. నిక్షయ్ పథకం ద్వారా ప్రతి నెలా పోషకాహార సహాయంగా ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వాణి, ఎస్తేర్ రాణి, జయలక్ష్మి, ప్రకాశరావు, రామదాసు, కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నరేష్, సాయి కృష్ణ, వెంకట్ , ప్రేమలత, జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్రాంతిని ముందే తెచ్చిన ముగ్గుల పోటీలు

- ప్రకాశం స్టేడియంలో కన్నుల విందుగా రంగుల పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాం రెడ్డి






**కొత్తగూడెం, జనవరి 12 (ప్రజా జ్యోతి):** చుక్కలన్నీ నేలకు దిగి అందాల హరివిల్లును ఆవిష్కరించాయి. అతివల చేతి నుంచి జారిన రంగవల్లులు కనువిందు చేశాయి. ముత్యాల ముగ్గులతో సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొంది. ముగ్గులపై ఆసక్తి, పోటీతత్వం ఉన్న మహిళలు తమ ప్రతిభ చూపేందుకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు కొత్తగూడెం కార్పొరేషన్ నుండి మహిళలు, యువతులు తరలివచ్చారు. సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 650 మంది మహిళలు, యువతులు రంగురంగుల రంగవల్లులతో ప్రకాశం స్టేడియంలో ఇంద్రధనుస్సులా మార్చేశారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కొత్తగూడెంతో తన అనుబంధం బలమైందని, దీన్ని ఎవరు విడదీయలేరన్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఆడబిడ్డలందరికీ భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల విశిష్టతను ముగ్గుల రూపంలో వేసి చూపించిన ఆడబిడ్డలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రథమ బహుమతి: డి ఛాముండేశ్వరి (రూ. 30,000), ద్వితీయ బహుమతి: కే. శ్రీరమ్య (రూ. 25,000), తృతీయ బహుమతి: కళ్యాణి (రూ. 20,000), నాల్గవ, ఐదవ (15వేలు), సాయి శ్వేత, (10వేలు) దుర్గా భవాని, దక్కించుకోగా హిమబిందు, పద్మ, శ్రీలత, మల్లీశ్వరి, ప్రశాంతి లకు కన్సోలేషన్ బహుమతులు తలా రూ. 5,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, ఊకంటి గోపాల్ రావు, నాగేంద్ర త్రివేది, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, గడిపల్లి కవిత, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, ఐఎన్టియుసి ఉపాధ్యక్షులు ఎండి రజాక్, పితాంబరం, రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, టెలికామ్ బోర్డు సభ్యులు బోదాస్ కనకరాజు, నాయకులు పూనెం శ్రీనివాస్, హరి, మాజీ కౌన్సిలర్స్, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఒప్పంద కార్మికులకు సి.యం.పి.యఫ్ ఖాతా పాస్ బుక్ ల పంపిణీ



**కొత్తగూడెం సింగరేణి, జనవరి 12 – ప్రజాజ్యోతి:** సింగరేణి కొత్తగూడెం సివిల్ డిపార్ట్మెంట్ లో నిర్వహించిన కార్యక్రమం లో సోమవారం సింగరేణి కార్పొరేట్ ఏరియాలో పనిచేయుచున్న ఒప్పంద కార్మికులకు సంబందించి 2023–24 సంవత్సరం వరకు వారి వారి సి.యం.పి.యఫ్ ఖాతా నందు జమ అయిన డబ్బులకు సంబంధించిన సి.యం.పి.యఫ్ ఖాతా పాస్ బుక్ లను ఒప్పంద కార్మికులకు పంపిణీ చేశారు. జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్–1 కే.వంశీధర్ కుసుంభ, విశిష్ట అతిధులుగా సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం.కనకమ్మ, జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ లు హాజరై ఒప్పంద కార్మికులకు సి.యం.పి.యఫ్ ఖాతా(2023–24) పాస్ బుక్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒప్పంద కార్మికులు అందరూ కూడా సి.యం.పి.యఫ్ రికవరీ అయ్యే విధంగా చూసుకోవాలని దానివల్ల కలిగే ప్రయోజనాలు ప్రతి ఉద్యోగి తెలుసుకోవాలని, ఎట్టి పరిస్థితిలోనూ సిఎంపిఎఫ్ ను విత్ డ్రా చేసుకోవద్దని, క్రమం తప్పకుండా 10 సంవత్సరాలు సిఎంపిఎఫ్ ఉద్యోగుల ఖాతా నందు జమ అయితే వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ సదుపాయం ఉంటుంది అని, భవిష్యత్తులో సి.యం.పి.యఫ్ ఖాతా నందు ఉన్న మొత్తము ఉద్యోగులు తెలుసుకునే విధంగా నూతన విధానాలను కూడా తీసుకువస్తున్నామని, త్వరలో 2024–25 సంవత్సరానికి సంబందించిన సిఎంపిఎఫ్ వివరాలను కూడా పాస్ బుక్స్ లో నమోదు చేసి ఇస్తామని తెలిపారు. సిఎంపిఎఫ్ ఆసిస్టంట్ కమిషనర్ పి.చిరంజీవి, డిజిఎం(పర్సనల్) ఐఆర్ వింగ్ వై.వి.ఎల్.వరప్రసాద్, ఎస్ఈ (సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ శ్రీ ఎస్.వి. రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టియూసి) వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంపిఎఫ్ నుండి వి.సులోచన, వెంకటేశ్వర్లు, ఆసిస్టంట్ సూపరింటెండెంట్ ఏవి రమేష్‌తో పాటు సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు, ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

## మేడారం భక్తులకు ఊరట ‘గుట్ట రోడ్డు’కు తాత్కాలిక మరమ్మతులు

- ఆళ్ళపల్లి కరకగూడెం అడవి బాట మరమ్మతులు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు చకచకా సాగుతున్న రహదారి పనులు



**ఆళ్ళపల్లి. జనవరి 12. ప్రజా జ్యోతి:** తెలంగాణలో ప్రసిద్ధ కుంభమేళాగా పిలవబడే మేడారం జాతర ప్రారంభం కానుండటంతో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆళ్ళపల్లి మండలంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. మర్కోడు నుంచి కరకగూడెం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న గుట్ట బాట అత్యంత అధ్వానంగా తయారవడంతో, భక్తుల ప్రయాణ సౌలభ్యం కోసం మండల అన్ని పంచాయతీల సమన్వయంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కదిలిన యంత్రాంగం భక్తులు అధిక సంఖ్యలో ఈ రహదారి గుండానే ప్రయాణిస్తారని గుర్తించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు పాయం రామనరసయ్య, నాయకులు పడిగ సమ్మయ్య, సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ సతీష్‌ల ఆధ్వర్యంలో అడవి బాటలో గుంతలను పూడ్చి, ప్రయాణానికి అనుకూలంగా మార్చారు. చాలా కాలంగా ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు ఈ మరమ్మతులతో సంతోషం వ్యక్తపరిచారు . జాతర సమయంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఈ తాత్కాలిక పనులతో పాటు. రహదారి పనులు చేపట్టాలని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వివేకానంద 164వ జయంతి వేడుకలు ఘనంగా

- యువతకు స్ఫూర్తినిచ్చిన సందేశాలు – కైట్ ఫెస్టివల్ ప్రత్యేక ఆకర్షణ

**అన్నపురెడ్డిపల్లి, జనవరి 12 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావు నిర్వహించగా, గ్రామ సర్పంచ్ లాకవతు లక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరుకాగా, జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీలక్ష్మి, ఎంపీడీవో కావూరి మహాలక్ష్మి, తహసీల్దార్ గంటా ప్రతాప్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద భారత యువతకు మార్గదర్శకుడని, ఆయన బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను యువత జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు యువతను ఉద్దేశించి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి ముందుకు సాగాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని హితవు పలికారు. స్వామి వివేకానంద ఆలోచనలను ఆచరణలో పెట్టినప్పుడే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువతకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమం చివరగా కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించి, హాజరైన వారికి గాలిపటాలను పంపిణీ చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. వేడుకలు ఉత్సాహంగా కొనసాగి విజయవంతంగా ముగిశాయి.




## కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలి

- ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి



**పాల్వంచ, కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 12, ప్రజా జ్యోతి:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన గ్రామ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి చురుకైన పాత్ర పోషించాలని పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతన సర్పంచ్ లతో మొదటి ఆహ్వాన సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రత్యేకించి ప్రభుత్వం 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ఏర్పాటు చేస్తుందని ,ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరై పూర్తి అవగాహనతో గ్రామపంచాయతీలను అభివృద్ధి పదంలో ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్యాలయ సూపర్డెంట్ సుధాలక్ష్మి, ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీవో పోరండ్ల రంగా, ఏపిఎం మీరాభి తదితరులు పాల్గొన్నారు.